## బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ సీనియర్ నేత చంద్రమోహన్

*గులాబీ కండువా కప్పిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్*



డీడీ కాలనీకి చెందిన బీజేపీ సీనియర్ నేత చంద్రమోహన్‌కు గులాబీ కండువా కప్పుతున్న కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట, నవంబర్ 20: బాగ్ అంబర్‌పేట డీడీ కాలనీకి చెందిన బీజేపీ సీనియర్ నేత చంద్రమోహన్ సోమవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఆయనకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే, బీఆర్ఎస్ నేత కోట్ల రామకృష్ణ ఆధ్వర్యంలో పలు బస్తీల నుంచి మహిళలు, యువత శ్యామ్, రాజు, అనూష్, సుహాసిని, రాజేశ్, స్వర్ణ, సునీత, ప్రియ, మనీశ్, సీతారామయ్య, సుమన్ తదితరులు దాదాపు 40 మంది బీఆర్ఎస్‌లో చేరారు. వీరందరికీ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బి.పద్మావెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కె.పద్మావతి డీపీ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు సీహెచ్. చంద్రమోహన్, నాయకులు పి.గిరిధర్ గౌడ్, మిర్యాల రవీందర్, కోట్ల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీ విజయానికి.. సీఎం కేసీఆర్ పథకాలే దోహదపడుతాయి



గోషామహల్ డివిజన్ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాజీ కార్పొరేటర్ ముఖేష్‌సింగ్‌తో కలిసి పాల్గొని ప్రసంగిస్తున్న టీఎస్‌టీఎస్ చైర్మన్ పి. జగన్మోహన్‌రావు

*టీఎస్‌టీఎస్ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు*

అబిడ్స్, నవంబర్ 20: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి, ప్రగతితోనే గోషామహల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని గోషామహల్ బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి, తెలంగాణ రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ పి.జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. ధూల్‌పేటలోని గోషామహల్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ముఖేష్‌సింగ్ కార్యాలయంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గంలోని 235 బూత్‌లలో తమ పార్టీ బూత్‌స్థాయి కో ఆర్డినేషన్ కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కమిటీ ప్రతినిధులు నియోజకవర్గంలో ఇంటింటికీ తిరిగి ఓటర్లను కలిసి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ.. బీఆర్ఎస్ అభ్యర్థి నంద కిశోర్ వ్యాస్ బిలాల్‌ను గెలిపించేందుకు కృషి చేస్తారన్నారు. ధూల్‌పేట లోధ్ కులస్తుల కోసం సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఆత్మగౌరవ భవనాలకు స్థల కేటాయింపులో భాగంగా లోధ్‌లకు కూడా ఉప్పల్ భగాయత్‌లో స్థలం కేటాయించారన్నారు. మాజీ కార్పొరేటర్ ముఖేష్‌సింగ్ మాట్లాడుతూ.. లోధ్ కులస్తులతో పాటు అన్ని వర్గాల ప్రజలు బీఆర్ఎస్‌ను ఆదరిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సంక్షేమ పాలన బీఆర్ఎస్‌కే సాధ్యం



మణికొండ మున్సిపాలిటీ కిర్రా కాలనీలో ఎమ్మెల్యే అభ్యర్థి ప్రకాశ్‌గౌడ్ రోడ్‌షోకు గజమాలతో స్వాగతం పలుకుతున్న మైనార్టీ నాయకులు

మణికొండ, నవంబర్ 20: అభివృద్ధి, సంక్షేమం, సుస్థిర పాలన అందించే సత్తా రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకే ఉన్నదని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి టి.ప్రకాశ్ గౌడ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మణికొండ మున్సిపాలిటీలో వేలాది మంది కార్యకర్తలతో కలిసి ఆయన రోడ్‌షో నిర్వహించారు. మున్సిపల్ పరిధిలోని నెమలీనగర్ నుంచి మొదలైన రోడ్‌షో.. గీతాంజలి స్కూల్, ఎల్ఐసీ కాలనీ, పుప్పాలగూడ పాత గ్రామం, అల్కాపూర్ చింతచెట్టు నుంచి నెక్నాంపూర్ పాత గ్రామం అల్కాపూర్ టౌన్‌షిప్ 100 ఫీట్ రోడ్ మీదుగా నిర్వహించారు. అనంతరం దిలీప్ సూపర్ మార్కెట్ నుంచి భాగ్యలక్ష్మి కాలనీ, పంచవటి కాలనీ, పోచమ్మ కాలనీ, అంజలి గార్డెన్, డైమండ్ హిల్స్, చిత్రపురి కాలనీలో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ అన్ని వర్గాల సంక్షేమానికి పెద్ద పీట వేసిందన్నారు. రాష్ట్రంలో పదేళ్ల పాలనలో దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి.. ఇంటింటా లబ్ధిదారులకు అందించిన ఘనత బీఆర్ఎస్ పార్టీదేనని అన్నారు.

## ఆంజనేయ స్వామి ఆలయం లేని గ్రామం లేదు..

# ప్రభుత్వ పథకం అందని గడపా లేదు

- రంగారెడ్డి- పాలమూరు ఎత్తి పోతల పథకం ద్వారా ప్రతి ఎకరాకు నీరు
- ముచ్చర్ల వరకు మెట్రో తీసుకువస్తా
- కందుకూరుపై సీఎం కేసీఆర్‌కు ప్రేమ
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి గ్రామంలో బీఆర్ఎస్‌కు బ్రహ్మరథం
- రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



తిమ్మాపూర్ గ్రామంలో మాట్లాడుతున్న సబితా ఇంద్రారెడ్డి

కందుకూరు. నవంబర్ 20: రంగారెడ్డి– పాలమూరు ఎత్తిపోతల పథకం ద్వారా ప్రతి ఎకరాకు సాగునీరుతో పాటు తాగునీరు అందించడానికి కృషి చేస్తానని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని సరస్వతీగూడ, అగర్ మియాగూడ, తిమ్మాపూర్, జబ్బార్‌గూడ, బేగంపేట, రాచులూరు, బైరాగిగూడ, కొత్తూరు గ్రామాల్లో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆంజనేయ స్వామి దేవాలయం లేని గ్రామం ఉండదన్నారు. ప్రభుత్వ పథకాలు అందని గడప లేదని చెప్పారు. తాను స్థానికురాలని కాదని బీజేపీ నాయకులు అంటున్నారని, మీ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్థానికుడా.. అని ప్రశ్నించారు. కిషన్‌రెడ్డి సికింద్రాబాద్ పార్లమెంట్ నుంచి ఎందుకు పోటీ చేశాడో తెలుపాలన్నారు. సీఎం కేసీఆర్‌కు కందుకూరు అంటే ప్రేమ ఉన్నదని చెప్పారు. ముచ్చర్ల గేటు వరకు మెట్రోతో పాటు మెడికల్ కళాశాల, 450 పడకల ఆసుపత్రి కావాలంటే తనను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చే హామీలను నమ్మితే మోసపోతారని , కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోను నమ్మవద్దని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రాన్ని అమ్ముకుంటారని మంత్రి ఎద్దేవ చేశారు. కాంగ్రెస్, బీజేపీ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని, మీ సేవకురాలుగా పని చేస్తానని చెప్పారు. 30వ తేదీన కారు గుర్తుకు ఓటేసి గెలిపిస్తే మరిన్ని సేవలు చేస్తానన్నారు. పొరపాటున ప్రతి పక్షాలకు ఓటు వేస్తే గోస పడుతారని వివరించారు.

### కిషన్‌రెడ్డి స్వగ్రామంలో బీఆర్ఎస్‌కు బ్రహ్మరథం..

కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం కిషన్‌రెడ్డి స్వగ్రామం తిమ్మాపూర్‌లో ప్రజలు బీఆర్ఎస్‌కు బ్రహ్మరథం పట్టారు. మహిళలు, పురుషులు. యువకులు పెద్ద ఎత్తున కేరింతలు, బతుకమ్మ ఆటలు ఆడుకుంటూ పూలవర్షం కురిపించారు. పటాకులు కాలుస్తూ స్వాగతం పలికారు. మంత్రి గ్రామంలో కలియ తిరిగారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కమిషన్ మాజీ సభ్యులు చిలకమర్రి నర్సింహ, జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మార్కెట్ చైర్మన్ సురుసాని సురేందర్‌రెడ్డి, సీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, వైస్ చైర్మన్ గోపిరెడ్డి విజేందర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సురుసాని రాజశేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకులు గంగాపురం లక్ష్మీనర్సింహారెడ్డి, వట్నాల ఈశ్వర్ గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్ ముదిరాజ్, ఎలుక మేఘనాథ్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు తాంద్ర ఇందిరమ్మ దేవేందర్, మాజీ ఎంపీపీ వట్నాల శోభ ఈశ్వర్‌గౌడ్, చిర్ర సాయిలు, గంగాపురం కవిత కరుణాకర్‌రెడ్డి, ఆనేగౌని అంజయ్యగౌడ్, సర్గారి బాల్‌రెడ్డి, గణేశ్ రెడ్డి, సర్పంచులు రాము, భూపాల్‌రెడ్డి, పరంజ్యోతి, గంగాపురం గోపాల్‌రెడ్డి, వరికుప్పల గోవర్ధన్, శ్రీనివాసచారి, రామకృష్ణారెడ్డి, నరేందర్‌గౌడ్, దావుద్, అర్జున అవార్డు గ్రహీత వెదిరె రవికాంత్‌రెడ్డి, సదానంద్ గౌడ్, గుయ్యని సామయ్య, డైరెక్టర్ పొట్టి ఆనంద్, దేవీలాల్, యూత్ నాయకులు తాళ్ల కార్తీక్, బొక్క దీక్షిత్‌రెడ్డి, సరికొండ వెంకటేశ్‌గౌడ్, శేఖర్‌గుప్తా, శివశంకర్, రవి ముదిరాజ్, బేతు రాంరెడ్డి, శ్రీను, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అడ్డగుట్టలో పద్మారావుగౌడ్‌కు హారతులు పట్టి, స్వాగతం పలుకుతున్న మహిళలు



గులాబీ రంగు ద్విచక్ర వాహనం నడిపి ఎన్నికల ప్రచారంలో సందడి చేస్తున్న పద్మారావుగౌడ్

# సికింద్రాబాద్ అభివృద్ధి మాకే సాధ్యం

- డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్
- అడుగడుగునా ప్రజల నీరాజనం

సికింద్రాబాద్, నవంబర్ 20: సికింద్రాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశామని, విద్యా, వైద్య రంగానికి అధిక ప్రాధాన్యతనిచ్చామని డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ పార్టీ సికింద్రాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి తీగుల్ల పద్మారావుగౌడ్ అన్నారు. సోమవారం సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని అడ్డగుట్ట డివిజన్‌లో తన ఎన్నికల ప్రచార యాత్ర నిర్వహించారు. ముందుగా డివిజన్ పరిధిలోని రియో పాయింట్ హోటల్ వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించి, పాద యాత్రను ప్రారంభించారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు స్వచ్ఛందంగా తరలివచ్చి ఆయన వెంట ఉన్నారు. నగర డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి, స్థానిక కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మీతో పాటు పద్మారావుగౌడ్ తనయుడు రామేశ్వర్‌గౌడ్ ఎన్నికల ప్రచార పాదయాత్రలో భాగస్వాములయ్యారు. అడ్డగుట్టలో పద్మారావుగౌడ్‌కు అడుగడుగునా ఘన స్వాగతం లభించింది. మహిళలు మంగళ హారతులు పట్టారు. గులాబీ పూల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. పద్మారావు గౌడ్ నిర్వహించిన పాదయాత్రలో పలువురు ఇతర పార్టీల నేతలు కూడా పాల్గొని ఆయనకు మద్దతు ప్రకటించి, బీఆర్ఎస్ లో చేరారు. అడ్డగుట్ట టీడీపీ సీనియర్ నేత గణేశ్ దంపతులు, వారి అనుచరులు పద్మారావు గౌడ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి పద్మారావుగౌడ్ పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు.

### ద్విచక్ర వాహనం నడిపి..

అడ్డగుట్ట డివిజన్ పరిధిలోని రియో పాయింట్ హోటల్ వద్ద నిర్వహించిన ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే అభ్యర్థి తీగుల్ల పద్మారావుగౌడ్ సందడి చేశారు. గులాబీ రంగు ఉన్న ద్విచక్ర వాహనం నడిపి అందరిని ఆశ్చర్య పరిచారు.